# వేయి వేషాలు వేయి

కోటి విద్యలూ కూటి కొరకే అని తెలుగులో ఒక సామెత వుంది. ఈ సామెత అసలు ఉద్దేశ్యం తెంగ్లీషులో చెబితే - పేపర్లో క్లాసిఫైడ్ ఎడ్వర్టైజ్మెంట్లల్లో (అంటే ఇండియాలో వాంటెడ్ కాలమ్స్ అన్నమాట) కోటి ఉద్యోగాలున్నాయి, అన్నిటికీ అప్లై చేసి ఏ అభాగ్యుడో రిప్లై ఇస్తే, ఆ ఉద్యోగం నీకే వస్తే, పొద్దున్నే ఇడ్లీన్లూ మిగతా రెండు పూటలా విందు భోజనం కాకపోయినా సందు భోజనం దొరుకుతుంది అని. దాన్నే అచ్చ తెలుగులో చెబితే - నీకు రెక్కాడాలంటే ఎన్నో మార్గాలు వున్నాయి, వాటిల్లో ఏదో ఒకదాంట్లో వేలు పెట్టి రెక్కాడిస్తే నీకు డొక్కాడుతుంది అని.

నేను ఇండియాలో వుండేటప్పుడు చూసేవాణ్ణి. నులకమంచం తల మీద పెట్టుకుని దాని మీద వంటగిన్నెలు బట్టలూ మొదలైనవన్నీ పెట్టేసుకుని, ఎక్కడ డొక్కాడితే అక్కడికి వెళ్ళేవాళ్ళు కష్టజీవులు. మేము కూడా స్వంతవూరు వదిలి త్రివేండ్రం వెళ్ళాం. ఆ కోటి విద్యల్లో ఒకటయిన ఇంజనీరింగ్ చదివాను కాబట్టి నులకమంచం బదులు రెండు సూట్‌కేసులతో వెళ్ళి, పదేళ్ళు కేరళలో కొబ్బరినూనె భోజనం (అవియల్ సంగతి సరేసరి) తిన్నాం. తర్వాత మళ్ళీ నాలుగు సూట్‌కేసులతో అమెరికా వచ్చి పాతికేళ్ళుగా వుంటున్నాం. తింటున్నాం. అది సరేనయ్యా... ఇంతకీ నువ్వు చెప్పదలుచుకున్న అసలు కథ ఏమిటి? వస్తున్నా.. వస్తున్నా..

'కర్పురపు కంపు' అని ప్రభంధ కవులు వాడారు. కంపు అంటే అసలు అర్థం, ఒకప్పటి అర్థం మంచి అర్థమే. వాసన అని. వాడుకలో అది ఏ దూర్వాసుడి శాపమో దుర్వాసనగా మిగిలిపోయింది. అలాగే ఈ కోటి విద్యలు కూడాను. అన్ని రకాల మోసాలూ, దొంగతనాలు ఈ కోటి విద్యల్లో కలిసిపోయాయి.

0 0 0

ఇంతకు ముందు ఈ కబుర్లలో చెప్పుకున్నాం, భారతదేశంలో చాలమంది అమెరికా రావాలనే కోరికతో, ఎన్నో రకాల పద్ధతుల్లో వీసా సంపాదించుకుంటున్నారని. ఈ మధ్య వచ్చిన గణాంకాల్లో అమెరికాకి వలస వచ్చే వారిలో భారతీయుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందనీ అది రోజురోజుకీ పెరుగుతున్నదనీ తెలుస్తున్నది. ఇండియాలో కూడా పెద్దా చిన్నా ఏ వూరులో చూసినా ఎవరో ఒకరు అమెరికాలోనో ఇంకో విదేశంలోనో వుండేవాళ్ళు ఎంతోమంది కనిపిస్తున్నారు. ఎందుకు ఇంతమంది దేశం వదిలి వెళ్ళిపోతున్నారు? వాళ్ళల్లో ఎందుకు వస్తున్నది ఈ కోరిక? వెళ్ళినవాళ్ళల్లో కనీసం ఐదు శాతం కూడా తిరిగిరాకపోవటానికి కారణాలు ఏమిటి? ఇవన్నీ సమాధానాలు లేని ప్రశ్నలు కావు. ఒకటి కాదు ఎన్నో, ఎన్నెన్నో సమాధానాలు వున్న ప్రశ్నలు. వాటి గురించి అవకాశం దొరికినప్పుడల్లా చెప్పుకుంటున్నాం. ఈవారం కబుర్లు ఈమధ్య చూసిన, విన్న కొన్ని వింత సంఘటనలకి స్పందించి వ్రాస్తున్నది.

అమెరికా రావటానికి వీసా కోసం మనవాళ్ళు వేయి వేషాలు వేస్తున్నారు.

వాళ్ళు వేయి వేషాలు వేస్తుంటే, వాళ్ళని రప్పించటానికి కొంతమంది అవకాశవాదులు ఇంకో వేయి వేషాలు వేస్తుంటారు. ఎన్నో కథలు కొన్ని పరోక్షంగానూ, కొన్ని ప్రత్యక్షంగానూ చూస్తున్నాం.

ఒక తెలుగాయన ఇండియానించీ ప్రతి సంవత్సరం కొంతమందిని హెచ్ వన్ వీసా ఇచ్చి, తెచ్చి, వాళ్ళనిక్కడ గాలికి వదిలేస్తాడు. వాళ్ళల్లో కొంతమంది వాళ్ళ తెలివితేటలవల్లనో, తెలిసినవాళ్ళుండటంవల్లనో, ముందుకు దూసుకుపోయే వ్యక్తిత్వం వల్లనో ఉద్యోగాలు వారంతట వాళ్ళు సంపాదించుకుంటారు. కానీ చాలమంది ఎన్నో ఇబ్బందులు పడతారు. ముందు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లని తెచ్చాడు. ఆ రోజుల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పరిస్థితి బాగానే వుండేది కనుక ఆయన వ్యాపారం బాగానే వుండేది. హైద్రాబాద్‌లో వాళ్ళ వాడెవడో లక్షల్లో డబ్బులు వసూలు చేసి, ఈయన వ్యాపారంలో (పా)పాలు పంచుకునేవాడు. తర్వాత ఆయన మీద చాల ఫిర్యాదులు రావటంవల్ల ఆయన బండారం బయటపడటం జరిగింది. ఆయన్ని ఇండియాలో దిగగానే అరెస్టు చేశారనీ, ఆనాడు పదవిలో వున్న ఒక మంత్రో ముఖ్యమంత్రో ఆయన్ని రక్షించి జైల్లోంచి బయట పడేశారనీ ఒక గాలి వార్త.

అలాగే ఒక రెస్టారెంట్ల యజమాని, ఇండియానించీ వంటవాళ్ళనే పేరుతో మగవాళ్ళనీ, ఆడవాళ్ళనీ తీసుకువచ్చేవాడు. అక్కడితో ఆగక లైంగికంగా ఆ ఆడవాళ్ళతో అక్రమ సంబంధాలు పెట్టుకోవటం, తత్ఫలితంగా వాళ్ళు ఆత్మహత్యలు చేసుకోవటం కూడా జరిగింది. అమెరికాలో లా ఒక్కింత కన్నా ఎక్కువే వుంటుంది కనుక, ఆయనగారు ప్రస్తుతం జైల్లో వున్నాడు. మా వూళ్ళోనే ఇంకో పెద్ద మనిషి వున్నాడు. ఆయనకీ ఇదే పని. ముందు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తర్వాత టీచర్లు వంటవాళ్ళు. అమెరికాలో ఎవరు అవసరమయితే వాళ్ళని అమెరికాకి తీసుకురావటం. ఉద్యోగాలివ్వలేక వాళ్ళని గాలికి వదిలేయటం. మాలాటివాళ్ళు కొంతమంది జాలిపడి, ఆ టీచర్ల చేత తోట పనులూ, ఇంటి పనులూ, వంట పనులూ చేయించుకుని పదో పరకో వాళ్ళ చేతుల్లో పెట్టటం. అలా వచ్చే వాళ్ళల్లో కూడా అందరు టీచర్లు టీచర్లూ కాదు, వంటవాళ్ళు వంటవాళ్ళూ కాదు. వీసా కోసం వేసే వేయి వేషాల్లో అవి కొన్ని. మొన్ననే మిత్రులెవరో చెబుతుంటే ఇంకొక సంఘటన విన్నాను.

ఏనాడో సుందరీ సుబ్బారావు అనే కథ చదివాను. నాకు బాగా నచ్చిన కథ. అందుకే ఆ పేర్లతో ఈ సంఘటన ఏమిటో చూద్దాం.

అమెరికాలో అదొక పెద్ద వూరు. పెద్ద వూరు కనుక భారతీయులూ ఎక్కువే. అందుకనే అక్కడ ఒక గుడి కూడా కట్టారు. గుడి కట్టారు కనుక, అక్కడికి ఒక పూజారిని ఇండియానించీ వీసా ఇప్పించి తీసుకు వచ్చారు. పూజలూ పునస్కారాలూ మొదలయాయి. నెమ్మదిగా ఎక్కువ జనం రావటం కూడా మొదలు పెట్టారు. సుందరీ సుబ్బారావూ కూడా గుడికి ప్రతి శనివారం వెడుతూనే వున్నారు. అమెరికా వచ్చి పాతికేళ్ళు దాటింది కనుక, కొత్తగా వున్న వూళ్ళోనే గుడి రావటం అక్కడ పూజలు చేయించటం వాళ్ళకి బాగానే వుంది.

శనివారం అష్టోత్తరం చేస్తున్నప్పుడు అన్నాడు సుబ్బారావు 'మన

పురోహితుడు కుర్రాడే అయినా అన్నీ చక్కగా చేయిస్తాడు చూశావా' అని. శఠగోపురం పెట్టాడు, ప్రసాదం పెట్టాడు, నవ్వుతూ చక్కగా మాట్లాడతాడు. అందుకనే సుబ్బారావ్‌కి బాగా నచ్చాడాయనకి, ముప్ఫై ఏళ్ళ వయసువాడే అయినా.

'ఏమో నాకు నచ్చలేదు. అతను మంత్రాలు చదివే పద్ధతీ, పూజలు చేసే విధానమూ... ' అంది సుందరి.

వెనకనే వున్న మూర్తి అన్నాడు 'అవును. నాకివన్నీ క్షుణ్ణంగా తెలుసు. ఆయన చదివేవి మంత్రాలు కాదు. నాలుగు శ్లోకాలు వల్లె వేసినట్టున్నాడు. వాటిల్నే ఇటూ అటూ తిప్పి తిప్పి కొడుతూ సాగదీస్తున్నాడు. ఉచ్చారణ కూడా స్పష్టంగా లేదు. జ్ఞ బదులు గ్న అంటున్నాడు ఎన్‌టీరామారావ్‌లా' అని.

ఆయన పక్కనే వున్న మూర్తిగారి భార్య 'ఈయన కన్నా నేనే నయం. సత్యన్నారాయణ వ్రతమూ, వినాయక చవితీ ప్రతి ఏటా మా ఇంట్లో శాస్త్రోక్తతంగా జరిపిస్తున్నాను' అని.

సుందరి నెమ్మదిగా సుబ్బారావుతో అంది 'నేను మనపూజారిని ఎక్కడో చూశానని చెప్పలేదూ. ఇప్పుడు గుర్తుపట్టాను. నూజివీడులో మా అన్నయ్య కొడుక్కి క్లాస్మేట్. బాలకృష్ణ. నేనక్కడే చూశాను. అతనికి అప్పుడే అమెరికా వెళ్ళాలని కోరిక. ఏమాత్రం చదువు అబ్బలేదనీ, బలాదూరుగా తిరిగేవాడనీ చెప్పేవాళ్ళు.... అతను పూజారి అయాడంటే నేను నమ్మను'. అతను కూడా సుందరిని గుర్తు పట్టాడనుకుంటాను. దూరం దూరంగా జరుగుతున్నాడు.

ఇలాటి కేసులు ఒకటి రెండు విన్నాను. వేదాల్లోనూ ఉపనిషత్తుల్లోనూ ఆధ్యాత్మికసారాన్ని తొణికిసలాడించిన మన హిందూమతం దురదృష్టవశాత్తూ, ఆచరణకి వచ్చేసరికీ కర్మకాండలతో, అనవసరపు 'తంతు'లతో నిండిపోయింది. దేవుడి గుడికి వచ్చేవాళ్ళల్లోకూడా చాలమందికి (అన్నీ తెలిసిన పండితులకీ, వేదాంత పారాయణులకీ క్షమాపణలు. వారి గురించి చెప్పటంలేదిక్కడ) కొబ్బరికాయ కొట్టటం, శఠగోపురం పెట్టించుకోవటం, గోత్ర నామాలతో సుఖంగా వుండాలని పూజ చేయించుకోవటం మీద వున్న ఆసక్తి ఇక దేని మీదా వుండటంలేదు. అదీకాక మనలో చాలమందికి తెలుగే సరిగ్గా రాదు. ఇక సంస్కృతంలో చదివే మంత్రాలేం అర్థమవుతాయి. అందుకే ఇలాటి బాలకృష్ణలు పూజారులయి, వీసాలు సంపాదించుకుని అమెరికా వచ్చేస్తున్నారు.

ఇక్కడికి చాలమంది స్వామీజీలు కూడా వస్తుంటారు. కొంతమంది ఇక వెనక్కి వెళ్ళరు. ఇక్కడే ఎవరో ఒకరి ఆశ్రయం సంపాదించి, ఒక చిన్న ఆశ్రమం పెట్టుకుని రామాయణం భారతం కథలు చెప్పుకుంటూ బ్రతికేస్తుంటారు. ఎవరైన కాస్త వేదాంతపరంగా కొంచెం తెలివైన ప్రశ్నలు అడిగినా, వాటి జోలికి వెళ్ళక కృష్ణుడు గోపికలతో ఎలా ఆడుకునే వాడో చెప్పి, ఇటు మనవాళ్ళనే కాకుండా అటు అమెరికన్స్‌ని కూడా అలరిస్తుంటారు.

కూటి కోసం కోటి విద్యలు. వీసా కోసం వేయి వేషాలు.

0 0 0